## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:189 | సోమవారం ఫిబ్రవరి 2, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌కు..

## కొత్త శక్తినిచ్చిన బడ్జెట్: ప్రధాని మోదీ



కేంద్ర బడ్జెట్ 2026-27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుందని, ఇది చరిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు. "బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని చెప్పారు.
ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ .. ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

## బడ్జెట్ తర్వాత 30 మంది విద్యార్థులను కలవనున్న నిర్మలమ్మ..

కేంద్ర ప్రభుత్వం 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ విధి విధానాలు, రూపకల్పన విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొంతమంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపాయి. 2లో..



## టెక్ కంపెనీలకు గుడ్‌న్యూస్..
## 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'



దిల్లీ: కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భారత్‌ను ప్రపంచ హబ్‌గా మార్చేందుకు కేంద్ర బడ్జెట్ లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రతిపాదనలు చేశారు. భారత్‌లోని డేటా సెంటర్లను వాడుకొని ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ సేవలు అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'ను ప్రతిపాదించారు. ఈ ప్రకటన.. దేశీయంగా డేటా సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్‌కు భారత్‌ను ఎగుమతి హబ్‌గా మార్చనుంది. ఉపాధి అవకాశాలకు కూడా ఊతమివ్వనుంది. 2లో..

## వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు: చంద్రబాబు

- పవిత్రత కాపాడటమే లక్ష్యం: బాధ్యతలు చేపట్టిన వెంటనే తిరుమల పవిత్రతను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని, అందులో భాగంగానే సమర్థులైన అధికారులను నియమించామని తెలిపారు.
- కల్తీ నెయ్యి వివాదం: ఎన్‌డీడీబీ నివేదికలో జంతు కొవ్వులు ఉన్నాయని తేలిన తర్వాతే తాను ఆ విషయంపై మాట్లాడానని స్పష్టం చేశారు.

2లో..

## కేంద్ర బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు: మంత్రి లోకేశ్



2లో..

## కేంద్ర బడ్జెట్..



# రాష్ట్రాభివృద్ధికి మరింత ఊతమిచ్చేలా ఉంది

- డైనమిక్ జోన్: అమరావతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల అనుసంధానంతో 5 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్థిక జోన్‌గా ఇది మారుతుందని పేర్కొన్నారు.
- డేటా సెంటర్ల హబ్: డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ఇవ్వడం వల్ల విశాఖపట్నం గూగుల్ వంటి సంస్థలతో గ్లోబల్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
- రేర్ ఎర్త్ కారిడార్: అరుదైన ఖనిజాల వెలికితీత కారిడార్‌లో ఏపీని చేర్చడం వల్ల రాష్ట్రంలోని బీచ్ శాండ్, ఇతర ఖనిజాలకు డిఫెన్స్, అటామిక్ ఎనర్జీ రంగాల్లో డిమాండ్ పెరుగుతుంది.

కుప్పం: పౌరుల జీవనశైలిని మార్చేందుకు కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గొప్ప బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు. కుప్పంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.
"రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్టు సహకరించేలా ఉంది. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించింది. వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉంది. 2047 వికసిత్ భారత్ డెవలప్డ్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఏఐ సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్ కు వెళు తుంది. రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బడ్జెట్ ఉంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. 2లో..

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

### ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి



హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. 2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసు..

### నాలుగున్నర గంటల పాటు కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్





హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకు పైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ విచాణను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేశారు. విచారణ అనంతరం నందినగర్ నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటి వద్దకు బీఆర్ఎస్ నేతలు భారీగా చేరుకున్నారు. బాల్కనీలో నిలబడి పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. పార్టీకి క్షేత్రస్థాయిలో చాలా బాగా ఉందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు.

- త్వరగా నిద్రపోవడం, యోగా, వ్యాయామం, మరియు ఉదయం నడక.
- మట్టి కుండ నీరు తాగడం, ఆహారాన్ని నమిలి తినడం.
- నవ్వు, మౌనం, సంతృప్తి, మరియు సానుకూల దృక్పథం.
- నిస్వార్థ ప్రేమ, ఇతరులకు సహాయం చేయడం మరియు కుటుంబంతో సమయం గడపడం.

## ఏపీకి కేటాయింపులు..

### నిర్మలమ్మ బడ్జెట్ భేష్: రామ్మోహన్ నాయుడు



దిల్లీ: వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువత మీద ప్రత్యేక దృష్టి పెట్టారని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రశంసలు కురిపిస్తూ ప్రకటన విడుదల చేశారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గింపు.. పౌర విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి వికసిత్ భారత్ లక్ష్యాలను మరింత వేగంగా చేరుకునేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. పౌర విమానాల విడిభాగాలపై పన్ను తగ్గించడంతో పాటు, శ్రీకాకుళం జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న కొబ్బరి కోలుకునేలా తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అన్నారు.నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ స్థిరమైన ఆర్థిక విధానంతో పాటు పెట్టుబడులు, సంస్కరణలపై బలమైన దృష్టి పెట్టడం ద్వారా, భారతదేశానికి మరింత ప్రగతిని, 2లో..

# బాధిత రైతును పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల



**తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్ :**
తొర్రేడు గ్రామంలో పెద్దపులి దాడిలో గాయపడిన ఆవుల యజమాని, రైతు ముగ్గల సత్తిరాజును రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరామర్శించారు. నిన్న రాత్రి సత్తిరాజుకు చెందిన రెండు ఆవులపై పులి దాడి చేసింది. బాధితుడికి ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులతో మాట్లాడామని, పులిని పట్టుకునేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## రేపు కలెక్టరేట్‌లో 'రెవెన్యూ క్లినిక్': కలెక్టర్ కీర్తి చేకూరి



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 2వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో 'మీకోసం' పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు 'రెవెన్యూ క్లినిక్' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. భూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీవోలతో పాటు జిల్లాలోని తహశీల్దార్లందరూ ఉదయం 9:30 గంటలకు రికార్డులతో సహా కలెక్టరేట్‌కు హాజరు కావాలన్నారు. మండల స్థాయిల్లో డిప్యూటీ తహశీల్దార్లు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

## బిసివై పశ్చిమగోదావరి యూత్ కన్వీనర్‌గా కట్టా సాయికిరణ్



**పెంటపాడు (జనసముద్రం న్యూస్ ప్రతనిధి)**
భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) పశ్చిమగోదావరి జిల్లా యూత్ కన్వీనర్‌గా పెంటపాడు మండలం అల్లంపురం గ్రామానికి చెందిన కట్టా సాయికిరణ్‌ను నియమించారు. జిల్లాలోని యువతలో ఆయనకున్న ఆదరణ, పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్రను గుర్తించి అధినేత బోడె రామచంద్రయాదవ్ ఈ బాధ్యతను అప్పగించారు. ఈ నియామకం పట్ల సాయికిరణ్ సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీ యువజన విభాగాన్ని బలోపేతం చేసి, యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి తీసుకువస్తానని ఆయన తెలిపారు.

## అనంతరాములు కి, దొడ్డా దుర్గమ్మ కి శుభాకాంక్షలు తెలిపిన చందు





**జనసముద్రంన్యూస్, మాచర్ల, ఫిబ్రవరి 1;**
పల్నాడు జిల్లా మాచర్ల పట్టణం లోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం కమిటీ ఛైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన కొమెర. అనంతరాములు కి, కమిటీ నెంబర్ దొడ్డా. దుర్గమ్మ కి, మిగతా కమిటీ సభ్యులకు 25వ వార్డు ఇంచార్జి దొడ్డా. చందు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## పట్లవీడు లో ఫిబ్రవరి నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ

**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి మండలం, ఫిబ్రవరి 1;**



పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని పట్లవీడు గ్రామం లో ఫిబ్రవరి నెల తాలూకా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్కే గఫూర్ (బూత్ కొ కన్వీనర్), సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి
కుప్పం: తిరుమల వేంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "తిరుమల పవిత్రమైన ప్రాంతం. మేం వచ్చిన వెంటనే తిరుమల పవిత్రతను కాపాడేందుకు చర్యలు చేపట్టాం. ప్రక్షాళనలో భాగంగానే శ్యామలరావును పంపాం. అప్పుడే శ్యామలరావు ఎన్?డీడీబీ నివేదిక అడిగారు. కల్తీ నెయ్యి ఘటనపై ఎన్?డీడీబీ నివేదిక వచ్చాకే మాట్లాడా. జంతు కొవ్వులు ఉన్నాయని.. కల్తీ చేశారని అప్పుడే చెప్పా. నేను మాట్లాడాక నానా యాగీ చేశారు.. సుప్రీంకోర్టుకు వెళ్లారు. కల్తీ నెయ్యి ఘటనలో దర్యాప్తు కోసం సిట్? వేశాం. నేను క్షమాపణలు చెప్పాలనే పరిస్థితికి వచ్చారు.. వాళ్లనేం అనాలి. వైకాపా నేతల ప్రవర్తన ఎలా ఉంటుందో ఇది ఒక ఉదాహరణ. శ్రీవారు నేను నమ్మే దేవుడు, వేంకటేశ్వరస్వామి దగ్గర నేను సామాన్య భక్తుడినే. వైకుంఠద్వారం గుండా వెళ్లి శ్రీవారిని ఎప్పుడూ దర్శించుకోలేదు. తిరుమల శ్రీవారితో పెట్టుకుంటే ఈ జన్మలోనే అనుభవిస్తారు. తిరుమలలో మహాపాపం చేశారు.. అపచారం చేశారు. అనిల్ కుమార్ సింఘాల్ బదిలీపై ఇప్పుడు మాట్లాడను" అని సీఎం తెలిపారు.

# కేంద్ర బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు: మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి
అమరావతి: భారతదేశ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన మేలు జరగనుందని అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ కారిడార్, హైస్పీడ్ రైలు అనుసంధానం, డేటా సెంటర్లకు పన్ను ప్రోత్సాహకాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి మరింత బలమైన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పర్యాటక రంగంపై నూతన దృష్టి వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయని సంతోషం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని పెట్టుబడులను వేగవంతం చేయడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆంధ్రప్రదేశ్ తదుపరి అభివృద్ధి దశకు శక్తినివ్వడం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

మొదటిపేజీ తరువాయి
దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు.
ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

## చిన్న ఇన్వెస్టర్లకు అండగా.. బైబ్యాక్‌లకు కళ్లెం..!



ఇంటర్నెట్ డెస్క్: మార్కెట్‌ను ప్రభావితం చేసే కీలక సంస్కరణలను ఈసారి బడ్జెట్ లో కేంద్రం ప్రవేశపెట్టింది. వీటిల్లో షేర్ల బైబ్యాక్ విధానంలో మార్పులు కూడా ఒకటి. క్యాపిటల్ గెయిన్స్ విధానంలో మాదిరిగానే వీటిపైనా పన్ను విధించాలని నిర్ణయించింది. దీని ప్రభావం కంపెనీలు, ప్రమోటర్లు, పెద్ద ఇన్వెస్టర్లపై వేర్వేరుగా పడనుంది.
వాస్తవానికి మార్కెట్‌లో బైబ్యాక్‌లపై పన్ను ఏ విధంగా వసూలు చేయాలనే అంశంపై దీర్ఘకాలంగా చర్చ జరుగుతోంది. ఎట్టకేలకు ఇప్పుడు దానిపై స్పష్టత వచ్చింది. గతంలో బైబ్యాక్ వేళ వాటాదారులకు వచ్చే సొమ్మును డివిడెండ్ కింద చూసేవారు. కంపెనీలు బైబ్యాక్ డిస్ట్రిబ్యూషన్ పన్నును చెల్లించేవి. ఇక వాటాదారులు మాత్రం తాము అందుకున్న మొత్తంపై పన్ను చెల్లిస్తాడు. అదే సమయంలో నష్టం వచ్చిన షేర్ ధరను విడిగా మూలధన నష్టంగా చూపించేవారు. ఈ విధానాన్ని తాజా బడ్జెట్ తొలగించింది. ఆ స్థానంలో బైబ్యాక్ మూలధన లాభాలుగా పరిగణించి పన్ను విధించనున్నారు. పన్ను ప్రయోజనాల కోసం అనుసరించే ఆర్బిటరేజీ విధానాలను నివారించేందుకు.. మైనార్టీ వాటాదారులను రక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.
పన్ను లబ్ధికోసం షేర్ల బైబ్యాక్‌లను వాడుకోవడం నివారించేందుకు ఇప్పుడు దీనిని తెరపైకి తెచ్చారు. ఈ విధానంలో దేశీయ కంపెనీల ప్రమోటర్లు, దేశీయేతర కంపెనీల ప్రమోటర్లకు వేర్వేరు పన్ను స్లాబ్‌లను ప్రకటించారు. డొమెస్టిక్ కంపెనీల ప్రమోటర్లు 22%, దేశీయేతర కంపెనీల ప్రమోటర్లకు 30% పన్ను చెల్లించాల్సి ఉంటుంది.
పన్నులు తప్పించుకోవడానికి ప్రమోటర్లు వెనకుండి నడిపించే బైబ్యాక్‌లను కట్టడి చేయడానికి ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కార్పొరేట్ గవర్నెన్స్‌ను మెరుగు పర్చడంతోపాటు.. నగదును మెరుగైన ఆదాయం సంపాదించేందుకు వినియోగించేలా ప్రోత్సహించనుంది.
ఏమిటీ షేర్ల బైబ్యాక్..
కంపెనీలు తమ వాటాలను మార్కెట్లు లేదా షేర్ హోల్డర్స్ నుంచి నేరుగా కొనుగోలు చేస్తాయి. మార్కెట్లో అందుబాటులో ఉండేవాటి సంఖ్య తగ్గిన ఫలితంగా మిగిలిన వాటాల విలువ పెరుగుతుంది. కంపెనీలు తమ వద్ద నగదు నిల్వలు సరిపడా ఉన్నప్పుడే బైబ్యాక్‌లు చేపడతాయి. సాధారణంగా వాటాదారులకు డివిడెండ్లు చెల్లించకుండా షేర్ విలువను చెల్లిస్తాయి.
సాధారణంగా బైబ్యాక్‌లు కంపెనీ ఆత్మవిశ్వాసాన్ని తెలియజేయడంతోపాటు.. షేర్ ధరకు మద్దతుగా ఉంటాయి. దీంతోపాటు ఎర్నింగ్ పర్ షేర్ విలువను కూడా పెంచుతాయి.
ఈ నిర్ణయంతో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం..
కొత్త విధానంతో రెగ్యూలర్ ఇన్వెస్టర్లకు లాభం. వీరికి సంబంధించి పాత విధానంలో బైబ్యాక్‌తో వచ్చిన సొమ్మును డివిడెండ్ కింద భావించేవారు. దీంతో 35% పన్ను చెల్లించాల్సి వచ్చేది. కానీ, కొత్త విధానంలో 20% షార్ట్ టర్మ్ గెయిన్స్ కింద.. 12.5% లాంగ్‌టర్మ్ గెయిన్స్ కింద చెల్లించాల్సి వస్తుంది. దీంతో నాన్ ప్రమోటర్ వాటాదారులపై పెద్దమొత్తంలో భారం తగ్గిపోతుంది. దీంతో మరింత మంది ఇన్వెస్టర్లు బైబ్యాక్‌లో పాల్గొనడానికి ఆసక్తి చూపుతారు. కంపెనీలు కూడా బైబ్యాక్‌పై పంపిణీ పన్ను చెల్లించాల్సిన అవసరంలేదు. ప్రమోటర్లు మాత్రం భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అసలు బైబ్యాక్ ప్రక్రియ నిర్ణయాల్లో ప్రమోటర్ల జోక్యం పెరిగిందనే విమర్శలు వెల్లువెత్తున్న వేళ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా సాధారణ వాటాదారుల కంటే ప్రమోటర్లకు ఉండే అదనపు అధికారాలు దుర్వినియోగం కావు.

# బడ్జెట్ తర్వాత 30 మంది విద్యార్థులను కలవనున్న నిర్మలమ్మ..

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వం ఎంపిక చేసిన విద్యార్థులు (ఌశీశ్రీశ్రీవస్త్రవ ౯బఎవత్‌ం) లోక్‌సభ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా బడ్జెట్ ప్రసంగాన్ని వినే అవకాశం కల్పించారు. వీరు కర్తవ్య భవన్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా సందర్శించనున్నారు. ఆర్థిక శాఖ పనితీరు, విధాన రూపకల్పన ప్రక్రియలు, అత్యున్నత స్థాయిల్లో ఆర్థిక నిర్ణయాలు ఎలా రూపొందిస్తారు, అమలు చేస్తారు అనే విషయాలను ఆ విద్యార్థులు తెలుసుకోనున్నారు. పరిపాలనకు సంబంధమైన విషయాలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడానికి కేంద్రం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విద్యార్థులతో సమావేశమై.. బడ్జెట్‌పై వారి అభిప్రాయాలను, సూచనలను తెలుసుకోనున్నారు.

# టెక్ కంపెనీలకు గుడ్‌న్యూస్.. 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'

మొదటిపేజీ తరువాయి
"భారత్‌లోని డేటా సెంటర్లను ఉపయోగించి ప్రపంచవ్యాప్త కస్టమర్లకు క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే కల్పిస్తాం. అయితే, ఈ ట్యాక్స్ హాలిడేను పొందేందుకు కంపెనీలు భారతీయ రీసెల్లర్ల ద్వారానే భారత కస్టమర్లకు సేవలను అందించాల్సి ఉంటుంది" అని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ విదేశీ సంస్థలకు డేటా సెంటర్ సేవలందించే భారతీయ కంపెనీలు 15 శాతం సేఫ్ హార్బర్ మార్జిన్ (విదేశీ కంపెనీలకు సేవలందించే దేశీయ ఐటీ సంస్థలకు వర్తించే నిర్దిష్ట లాభ మార్జిన్) పొందొచ్చు. ఈ సేఫ్ హార్బర్ నిబంధనలను పొందేందుకు అవసరమైన టర్నోవర్ పరిమితిని రూ.300 కోట్ల నుంచి రూ.2 వేల కోట్లకు పెంచారు.
బడ్జెట్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్: భారీగా పెరిగిన రక్షణ బడ్జెట్
ఏంటీ ట్యాక్స్ హాలిడే..
ట్యాక్స్ హాలిడే అంటే నిర్దిష్ట కాలం పాటు కంపెనీలు ఆదాయ, కార్పొరేట్ వంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేకుండా మినహాయింపులు పొందొచ్చు. ఫలితంగా కంపెనీలపై ప్రాజెక్ట్ ఖర్చుల భారం తగ్గుతుంది. దీని వల్ల ఆయా రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలు లభిస్తుంది. ప్రపంచస్థాయి కంపెనీల దృష్టిని ఆకర్షించేందుకు వీలవుతుంది. అంతేగాక, ఉద్యోగాల సృష్టి జరగడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది.
ఐటీ కంపెనీలకు రెడ్ కార్పెట్
ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీంతో పాటు రైడెన్ ఇన్ఫో, ఇతర కంపెనీలు కూడా భారత్‌లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. తాజా 'ట్యాక్స్ హాలిడే'తో ఈ కంపెనీలకు రెడ్‌కార్పెట్ పరిచినట్లయ్యింది. ఈ నిర్ణయంతో ఐటీ, ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో వేలాది ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అంతేగాక విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లోనూ అభివృద్ధి జరగనుంది. దేశ భద్రత పరంగానూ ఇది కీలకంగా మారనుంది.
ఏంటీ డేటా సెంటర్లు..
డేటా సెంటర్ అంటే డేటా నిల్వ చేసి, ప్రాసెస్ చేసి, నిర్వహించే కేంద్రం. వివిధ సంస్థలు తమ కీలక అప్లికేషన్లు, డేటా నిల్వ చేయడానికి, డెలివరీ చేయడానికి వీలుగా కంప్యూటింగ్, నిల్వ వనరుల నెట్‌వర్క్‌పై డేటా సెంటర్ రూపకల్పన ఆధారపడి ఉంటుంది. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, క్లౌడ్ సర్వీస్, ఏఐ, బిగ్‌డేటా వంటి సేవలు అన్నీ డేటా సెంటర్‌పైనే ఆధారపడి ఉంటాయి. కంపెనీల వాణిజ్య కార్యకలాపాలకు డేటా సెంటర్లు ఎంతో కీలకం.

# ఏపీకి కేటాయింపులు..

## నిర్మలమ్మ బడ్జెట్ భేష్: రామ్మోహన్ నాయుడు

మొదటిపేజీ తరువాయి
సుస్థిర అభివృద్ధిని తీసుకురాగలిగిందని రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం సామాన్యులను మరింత ఆకట్టుకుందని తెలిపారు. ఏడు నగరాల మధ్య హై స్పీడ్ కారిడార్లు, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, డేటా సెంటర్ల ఏర్పాటుకు తోడ్పాటు అందివ్వడం.. ఇలా ప్రతీ అంశం ప్రగతిని సూచిస్తోందని అన్నారు.ప్రస్తుత ప్రపంచ అస్థిరతల నడుమ కూడా ప్రభుత్వం బలమైన, స్థిరమైన ఆర్థిక విధానాన్ని పాటిస్తోందని.. 2026-27కి కేంద్ర పెట్టుబడులను గతంలో కంటే అధికంగా రూ.12.2 లక్షల కోట్లకు పెంచడం ద్వారా ప్రభుత్వం తన విజన్‌ను స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు తన శాఖ పరిధిలోని పౌర విమానయానం, విమానాశ్రయాలతో పాటు రైల్వేలు, రహదారులు, పోర్టులు, లాజిస్టిక్స్, పట్టణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లపై ఉన్నాయని అన్నారు. ఇది ఉపాధి, పెట్టుబడులు, పెట్టుబడిదారుల విశ్వాసానికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో బాలికల వసతి గృహం గొప్ప ఆలోచన అని అన్న రామ్మోహన్ నాయుడు.. బాలికా విద్య మరింత ఉన్నతంగా ప్రకాశిస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ నిర్మలమ్మ పద్దులు ఉండటం, అందులో ఆంధ్రప్రదేశ్‌కు సైతం సింహభాగం కేటాయింపులు జరగడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన పంటగా ఉన్న కొబ్బరికి తోడ్పాటు అందించే విధంగా కొబ్బరి ప్రోత్సాహక పథకం.. ఉద్దాన ప్రాంతానికి మళ్లీ పూర్వ వైభవాన్ని తెస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీడి పంటకు సైతం తోడ్పాటు అందించే విధంగా కేటాయింపులు ఉండటం శుభపరిణామం అన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి మరింత ఊతమిచ్చేలా ఉంది

మొదటిపేజీ తరువాయి
టెక్స్ టైల్ సెక్టార్‌కు కూడా ఊతమిచ్చారు. మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుంది. పర్యాటకానికి, హాస్పిటాలిటికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అరకులో టూరిజం పెరగడానికి దోహదం చేస్తుంది. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు ఊతమిచ్చేలా చర్యలు ఉన్నాయి. డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారు. దీంతో.. భారత్ డేటా సెంటర్ల హబ్‌గా తయారవుతుంది. విశాఖకు గూగుల్ సహా వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. లాజిస్టిక్స్ రంగానికి ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్టులో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు.టెక్నాలజీ సాయంతో మనదేశంలో అనేక మార్పులు వస్తున్నాయి. మనదేశం ఏఐని వేగంగా అందిపుచ్చుకుంటోంది. కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయం వల్ల కొత్తగా 3 హై స్పీడ్ రైల్ కారిడార్‌లు వస్తున్నాయి. అందులో హైదరాబాద్-బెంగుళూరు.. అనంతపురం, కర్నూలు కవర్ అవుతుంది. హైదరాబాద్-చెన్నై కారిడార్ అమరావతి, తిరుపతి మీదుగా చెన్నై వెళుతుంది. బెంగుళూరు -చెన్నై.. పలమనేరు, చిత్తూరు మీదుగా రాబోయే రోజుల్లో తిరుపతికి కనెక్ట్ చేసే విధంగా ఉంటుంది. ఈ మూడు కారిడార్లు ఏపీని కవర్ చేసే పరిస్థితి వస్తుంది. హైస్పీడ్ రైళ్లు వస్తే.. అమరావతి, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ఈ నాలుగు సిటీలు.. 5 కోట్ల జనాభా, ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా డైనమిక్ జోన్‌గా తయారవుతుంది.డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్ .. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ను కూడా చేర్చారు. అరుదైన ఖనిజాల వెలికితీతవల్ల ఏపీకి ఎంతో లాభం. బీచ్ శాండ్‌తో పాటు మన రాష్ట్రంలో వివిధ రకాల మినరల్స్ ఉన్నాయి. డిఫెన్స్, అటామిక్ ఎనర్జీ, సోలార్ ప్యానల్స్, క్రిటికల్ ఎలక్ట్రానిక్స్‌కి వీటిని ఉపయోగించుకునే పరిస్థితి వస్తుంది. ఇది ఒక పెద్ద శుభపరిణామం. ఐఎస్ఎం 2.0.. సెమీ కండకర్టర్ రంగానికి దోహదం చేస్తుంది. ఇది టెక్నాలజీకి పెద్దపేట వేయడమే" అని సీఎం చంద్రబాబు అన్నారు

# నోటీస్ పంపడానికి టైం లేదు విచారణకు రావాలంటున్న పెద్దపల్లి డిఎల్పీఓ దేవకి దేవి

**- జూనియర్ అసిస్టెంట్ రాజేందర్ ఫోన్ కాల్**

**- నోటీసు లేకుండా నేను రాను బొబ్బిలి సత్యనారాయణ**

జన సముద్రం న్యూస్ : 01 ఫిబ్రవరి ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )



పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తూముల రవి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 43 (8) ప్రకారం గ్రామ పంచాయతీలో స్థానికంగా నివసిస్తూ విధులు నిర్వర్తించాలి. కానీ అందుకు విరుద్ధంగా ప్రస్తుతం వారు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నివసిస్తున్నారని తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 43(8) ప్రకారం, తమ విధులు నిర్వర్తించే పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీలోనే నివసించాలని స్పష్టమైన సూచనలు ఉన్నాయని పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి జారీ చేసిన మెమో నెం:నా1/32/2020, తేదీ: 05-02-2020. ప్రకారం పంచాయతీ కార్యదర్శి తూముల రవి పై చట్టపరమైన చర్యలు తీసుకోవలని సోషల్ వర్కర్, స.హ. చట్టం కార్యకర్త బొబ్బిలి సత్యనారాయణ తేదీ 25 సెప్టెంబర్ 2025 రోజున కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ తెలంగాణ హైదరాబాద్ కి ఫిర్యాదును పంపించడంతో అధికారులు మెమో.నెం.సిపిఆర్ఆర్ఇ-డి3/ఈఎస్ఎస్టి/ సిఎమ్ పిటి/4/2025 , తేదీ :10.10.2025. అను లేఖను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు , జిల్లా పంచాయతీ అధికారి కి పంపించారు. అట్టి లేఖ పంపించి 4 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు రాఘవపూర్ పంచాయతీ కార్యదర్శి పై ఎలాంటి విచారణ చేయలేదు. ఎలాంటి చర్యలు తీసుకోలేదని స.హ. చట్టం కార్యకర్త , సోషల్ వర్క్ బొబ్బిలి సత్యనారాయణ అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేశారు.

### నోటీసు లేకుండానే విచారణకు రావాలంటున్న డిఎల్పిఓ దేవకీ దేవి...!!

బొబ్బిలి సత్యనారాయణ ఫిర్యాదు పై 4 నెలల అనంతరం తేదీ 30 జనవరి 2025 రోజున మధ్యాహ్నం 12 :09 నిమిషాలకు పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ రాజేందర్ బొబ్బిలి సత్యనారాయణ కు ఫోన్ చేసి వారు ఇచ్చిన ఫిర్యాదు పై తేదీ 31 జనవరి 2025 రోజున 11: 30 నిమిషాలకు డిఎల్ఓపి దేవకి దేవి విచారణకు వస్తారని బొబ్బిలి సత్యనారాయణ హాజరు కావాలని డిఎల్పి ఓ చెప్పమని చెప్పారని సమాచారం ఇస్తున్నామని తెలిపారు. బొబ్బిలి సత్యనారాయణ మాట్లాడుతూ విచారణపై నోటీస్ పంపించారా అని అడిగితే టైం లేదని అందుకే ఫోన్ ద్వారా చెబుతున్నామని తెలిపారు. నోటీసు లేకుండా ఎలా విచారణ చేస్తారని నోటీస్ పంపిస్తేనే విచారణకు వస్తానని బొబ్బిలి సత్యనారాయణ తెలిపారు.

### ప్రభుత్వం ఇచ్చిన అధికారాన్ని ఇష్టం వచ్చినట్లుగా ఉపయోగిస్తున్న పెద్దపల్లి డిఎల్పిఓ దేవకి దేవి

ఫోన్ సంభాషణ పై బొబ్బిలి సత్యనారాయణ మాట్లాడుతూ డిఎల్పిఓ దేవకి దేవి వారి అధికారాన్ని వారికి ఇష్టం వచ్చినట్టుగా ఉపయోగిస్తున్నారని ఒక ప్రభుత్వ అధికారి నోటీసు లేకుండా ఫిర్యాదుదారుడిని ఎలా విచారణకు రావాలని వారి సిబ్బంది ద్వారా ఫోన్ చేయిస్తారని తాను కూడా ఏదైనా తన గ్రామంలోని సమస్యపై డిఎల్పిఓ కి ఫోన్ చేస్తే పరిష్కరిస్తారా గ్రామానికి వెంటనే వస్తారా పెద్దపల్లి మండలంలో , డివిజన్ లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు పెరిగిపోతున్నాయని ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని సామాన్యులకు ఇల్లు కట్టుకునే క్రమంలో భూమి కొనుగోలు చేసిన వాళ్లకు అనుమతులు విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రత్యక్షంగా కలిసి చెప్పినా కూడా ఇంత వరకు ఆ అక్రమ లేఔట్ ల పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని కనీసం వాటిని సందర్శించలేదని బొబ్బిలి సత్యనారాయణ విమర్శించారు. నోటీస్ లేకుండానే విచారణకు రావాలని తెలిపిన డిఎల్పిఓ దేవకి దేవి ఇక విచారణ సక్రమంగా ఎలా చేస్తారని పారదర్శకత ఎలా ఉంటుందని వాపోయారు.

# ప్రాణానికి తెగించి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ పై కేసుల.....



**- కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు..**

**- కొల్చారం లో మెదక్ - హైదరాబాద్ రహదారిపై రాస్తారోకో.....**

**- తుక్కాపూర్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం...**

మెదక్ జిల్లా, ప్రతినిధి,ఫిబ్రవరి 01( జన సముద్రం న్యూస్):-

రాదనుకున్న తెలంగాణను సాధించిన మొనగాడు కెసిఆర్... కెసిఆర్ మీద సిట్ అని, పోటు అని, పటు అని భారత రాష్ట్ర సమితి పార్టీని బదునాం చేసి, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని కపట నాటకం ఎత్తుకున్నారని కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌర్ శంకర్ గుప్తా నిప్పులు చెరిగారు. మెదక్ జిల్లా లోని మండల కేంద్రమైన కొల్చారం బస్టాండ్ వద్ద బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బి ఆర్ఎస్ శ్రేణులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



గుంపు మేస్త్రి డౌన్ డౌన్... సీఎం డౌన్ డౌన్... అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ విచారణ పేరుతో కాలయాపన చేయకుండా... టిఆర్ఎస్ పార్టీని బదనాం చేసేందుకు సీఎం కుట్ర పన్నుతున్నారని, దమ్ముంటే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, పైతర సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి, సర్పంచులు కోరబోయిన లక్ష్మీ పెంటయ్య, అరిగే స్వర్ణలత విజయ్ కుమార్, చిన్నారం ప్రభాకర్, మాజీ సర్పంచ్ గోదావరి, శ్రీధర్ గౌడ్, లంబాడి చందర్, సాజిద్ఖాన్, బాగారెడ్డి, ముత్యం ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి, వేమారెడ్డి, ధనరాజ్, కొరంపల్లి గోపి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, చిన్న రాములు, నింగోళ్ల చెన్నయ్య, చింతల కృష్ణ, ఆశమ్మోల సత్తెనరి, ఎండుగుల కృష్ణ, సాయిని సిద్ధిరాములు, గౌరీశంకర్, సంగమేశ్వర్, కిష్టాపూర్ నాగరాజు, గుడాల నర్సిములు, దుర్గాప్రసాద్ గౌడ్, చాకలి శ్రీను, గ్యాస్ కృష్ణ, నహీం బాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే తుక్కాపూర్ లో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరే రవీందర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు.

# లక్షలాది భక్తులతో దామెర సమ్మక్క సారక్క మహాజాతర విజయవంతం

**పటిష్ఠ బందోబస్తు మధ్య సమ్మక్క,సారక్క పగిడిద్ద రాజు తిరుగు ప్రయాణం**

ఎల్కతుర్తి పిబ్రవరి 01 (జనసముద్రం)



ఎల్కతుర్తి మండల కేంద్రంలోని దామెర,బీమదేవరపల్లి,మండలంలో ముల్కనూర్ ప్రాంతం మరోసారి ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. జనవరి 28. ప్రారంభమై 29. 30. సమ్మక్క, సారక్క జాతరకు ఈసారి కూడా లక్షలాది భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. గ్రామాల నలుమూలల నుంచి మాత్రమే కాకుండా జిల్లాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.సమ్మక్క, సారక్క పగిడిద్దరాజు 31న తిరుగు ప్రయాణం సందర్భంగా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. పోలీసు శాఖ, అగ్నిమాపక, వైద్య బృందాలు, స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో విధులు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో జాతర ప్రశాంతంగా ముగిసింది.సమ్మక్క,సారక్క తమ ఇలవేల్పులుగా భావించే భక్తులు మొక్కులు చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోరికలు నెరవేరాలని, పాడి పంటలు పంచగుండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థనలు చేశారు. అనేక మంది భక్తులు తమ మొక్కులు తీర్చుకుని, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.ప్రత్యేకించి ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించే ఈ జాతరలో సంప్రదాయ వేషధారణలు, జానపద నృత్యాలు, భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సమ్మక్క, సారక్క భక్తుల నమ్మకం ప్రకారం, ఈ దేవతలు కోరిన కోర్కెలు తప్పకుండా తీర్చుతారని విశ్వాసం. ఆ విశ్వాసమే ప్రతి రెండేళ్లకోసారి లక్షల మందిని ఇక్కడికి తీసుకొస్తోంది.జాతర ముగిసిన అనంతరం పగడివద్దరాజు తిరుగు ప్రయాణం శాంతియుతంగా సాగింది. భక్తులు క్రమశిక్షణతో తమ గ్రామాలకు తిరుగు ప్రయాణమవ్వడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మహాజాతర మరోసారి సమ్మక్క, సారక్క మహిమను చాటిచెప్పుతూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది.ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షులు కమిటి సభ్యులు పాల్గొన్నారు కాజిపేట ఏ సి పి పింగిళి ప్రశాంత్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేశ్ ఎల్కకతుర్తి ఎస్సై ప్రవీన్ కుమార్ ముల్కనూర్ ఎస్సై రాజు వంగర ఎస్సై దివ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం





ఎల్కతుర్తి పిబ్రవరి 01 (జనసముద్రం)

ఎల్కతుర్తి మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ఎల్కతుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్ నేతృత్వంలో బస్టాండ్ కూడలి వద్ద నల్ల బ్యాడ్జీలతో బైక్ ర్యాలీ చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ ఎస్ఐటీ విచారణ పేరుతో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును వేధించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపిస్తూ 165 జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై కుట్రలు చేసినా ఆయనపై ఎలాంటి తప్పులు లేవని తెలంగాణ సమాజానికి తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలని, అభివృద్ధి శూన్య పాలనను విడనాడాలని డిమాండ్ చేశారు.

అనంతరం బస్టాండ్ కూడలి నుంచి సబ్‌స్టేషన్, అక్కడి నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు శాంతియుత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలి

జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 2 సూర్యపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ ఆర్సి రిపోర్టర్ అలవాల రవికుమార్




హుజూర్నగర్ పట్టణంలో ఆదివారం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, టిఆర్ఎస్ టు యు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐ ఎన్ టి యు సి నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం హక్కులను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. లేబర్ కోడ్స్ పేరుతో కార్మికులకు ఉన్న హక్కులను హరిస్తూ, ఉద్యోగ భద్రతను దెబ్బతీస్తూ, వేతనాలు తగ్గించే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను నిర్వీర్యం చేయడం, నిధులు తగ్గించడం ద్వారా గ్రామీణ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.

దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుతుండటం, ధరల పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఆర్థిక భారాన్ని మోస్తుండగా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా విధానాలు చేపడుతోందని అన్నారు. వెంటనే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, జీ రామ్ జీ స్కీం సహా కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్య నాయకులు చిట్యాల అమర్నాథ్ రెడ్డి, జడ శ్రీనివాస్,శీతల రోషపతి, . ఐ ఎన్ టి యు సి నాయకులు ముక్కంటి, రాజు, సావిత్రి,జానయ్య, వీరబాబు, వెంకన్న, రవీందర్, ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, రాంమూర్తి. సిఐటియు నాయకులు, మల్లయ్య, పద్మ, నాగేశ్వరరావు, పర్వతాలు, అంజయ్య. టిఆర్ఎస్కెవి నాయకులు చలవాది సైదులు. టి ఎన్ టి యు సి నాయకులు గుండెబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# దేశాయిపేటలో ఉచిత వైద్య శిబిరం-

**200 మందికి పరీక్షలు**

చొప్పదండి(జనసముద్రం న్యూస్):



చొప్పదండి మండలం దేశాయిపేట గ్రామంలో వజ్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ సర్పంచ్, బీజేపీ నాయకులు గుంట రవి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది.

ప్రముఖ ఛాతి వ్యాధి నిపుణులు డాక్టర్ సుమన్ కుమార్, డాక్టర్ నల్ల దిలీప్ లు సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రధానంగా శ్వాస, ఛాతి సమస్యలు, జ్వరం, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మరియు మధుమేహం వంటి రుగ్మతలతో బాధపడుతున్న వారికి తగిన చికిత్స అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే జనరిక్ మందులు బయట మార్కెట్ ధరలో కేవలం 10 నుంచి 25 శాతం ధరకే లభిస్తున్నాయని చొప్పదండి రైతు సహకార సంఘం ఎటువంటి లాభాపేక్ష లేకుండా వీటిని అందిస్తోంది. ప్రజలు ఖరీదైన మందుల వైపు వెళ్లకుండా, తక్కువ ధరకే నాణ్యమైన మందులు లభించే జనరిక్ షాపులను ప్రోత్సహించాలి అంటూ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ తిరుమల-కొమురయ్య, సింగిరెడ్డి అశోక్ రెడ్డి, పెరుమాండ్ల రవీందర్, కొలిపాక మల్లేశం, వెల్మ హన్మంతరెడ్డి, చంటి బాబు, గంగస్వామి, వెల్మ లత, సుద్దాల రేణుక తదితరులు పాల్గొన్నారు

# హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్ నాగులు మీరా ఆధ్వర్యంలో వెల్ఫేర్ కార్డుల పంపిణీ

జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 2 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ ఆర్సీ రిపోర్టర్ అలవాల రవికుమార్




హుజూర్నగర్ హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు: షేక్ నాగుల్ మీరా ఈరోజు ఒకటో తారీఖున పనులు బంద్ చేసి పెయింటింగ్ వర్కర్స్ సమావేశం శిల్పకళ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆఫీసులో నిర్వహించడం జరిగినది సమావేశంలో పెయింటింగ్ కార్మికుల సమస్యలపై మరియు ఈ మధ్యకాలంలో కొత్తగా చేరిన పెయింటర్స్ కి వెల్ఫేర్ కార్డులు, సంఘం కార్డులు ఎలుక సోమయ్య గౌడ్ గారి చేతుల మీదుగా ఇవ్వడం జరిగినది కార్డులు లేని వారు తప్పనిసరిగా వెల్ఫేర్ బోర్డు కార్డులు సంఘం కార్డులు చేయించుకోవాలని లేనిపక్షంలో ప్రమాదవశాత్తు సంఘటన జరగడం వల్ల గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ను కోల్పోతున్నారు కావున ప్రతి ఒక్క పెయింటింగ్ కార్మికులు వెల్ఫేర్ బోర్డ్ కార్డులు సంఘం కార్డులు చేయించుకోవాలని ఉన్నవారు కార్డులు రెన్యువల్ లో ఉన్నవా లేవా అని సరిచూసుకోగలరని లేనియెడల వెంటనే రెన్యువల్ చేయించుకోవాల్సిందిగా పెయింటింగ్ కార్మికులందరికీ తెలియజేయుచున్నాము తదనంతరం పెయింటింగ్ కార్మికులు పడుతున్న సమస్యలపై చర్చించడం జరిగినది ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి తురక నరేష్, కోశాధికారి అమరబోయిన నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు యామల శ్రీను, సహాయ కార్యదర్శి ఎండి బాబా , కమిటీ సభ్యులు శీలం సైదులు, పెదకాసు సారయ్య, దుండిగల నారాయణ, భారత రాజేష్ సభ్యులు జలాల్,దుండిగల్ నాగులు, మహబూబ్, జానీ, శ్రావణ్, మునీర్, యాకయ్య, సందీప్, ఉపేందర్, ఆది, చక్రాల సాయి, నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# 'పెద్దపులి కలకలం' రైతును పరామర్శించిన బొడ్డు, గోరంట్ల

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్:



తొర్రేడు గ్రామంలో పెద్దపులి సంచారంతో ముగ్గల సత్తిరాజుకు చెందిన రెండు ఆవులపై పులి దాడి ఘటన తెలుసుకుని రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బాధితుడైన రైతును పరామర్శించి, జరిగిన నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని, బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో చర్చించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## “ఘనంగా ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా కోన శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం “

**తాడేపల్లిగూడెం**
**(జన సముద్రం న్యూస్ ప్రతినిధి)**

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ కోన శ్రీనివాసరావు నేడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారం మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 5000 మంది ఆర్య వైశ్య ప్రముఖులు నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఐవీఎఫ్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసగుప్త, మహారాష్ట్రకు చెందిన ఐవిఎఫ్ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రమేష్ అగ్రవాల్ మాజీ శాసనసభ్యులు మరియు చలనచిత్రం నిర్మాత అంబికా కృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ హాజరయ్యారు. ముందుగా సుమారు వాసవి మాత దేవాలయంలో పూజలు చేసిన అతిధులు 100 కారుల ర్యాలీతో వాసవి మాత ఆలయం నుండి ప్రమాణ స్వీకార వేదిక కమ్మ కళ్యాణ మండపానికి బాణాసంచా నడుమ, ప్రత్యేక పాటలతో పూలవర్షం కురుస్తూ ఉండగా కళ్యాణ మండపానికి హాజరయ్యారు. ఉప్పల శ్రీనివాస గుప్తా పర్యవేక్షణలో డాక్టర్ కోన శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మహిళా




విభాగం, యోజన భాగం, సేవా కార్యక్రమాలకు సంబంధించిన వివిధ కమిటీలు, రాష్ట్ర కమిటీలు జిల్లా కమిటీలు ప్రమాణ స్వీకారాలు చేశారు. ముఖ్యఅతిథి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు, కొనిజేటి రోశయ్య వంటి మహనీయులు రాష్ట్రం కోసం అశులు బాసితే వారిని సామాజిక వర్గాలకు అంతకట్టడం మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులకే ఎవరైనా అర్హులై సేవా కార్యక్రమాల అందాక పోతే వారికి ఐవీఎఫ్ ద్వారా తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. రకరకాల సంఘాలు ఉన్నప్పటికిని అవన్నీ సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలియజేశారు. పలు సందర్భాలలో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల ఫలితంగా వ్యాపారాల్లో అధికంగా ఉండే వైశ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. కోన శ్రీనివాసరావు రానున్న మూడు సంవత్సరాల కాలంలో కోటి రూపాయల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని సింహం ఎక్కడున్నా సరే సింహం గాని బతుకుతుంది పదవి లేకపోయినా అదే స్థితిలో పనిచేసే వ్యక్తి కోణా శ్రీనివాస అని కోన శ్రీనివాస్ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. తెలంగాణ ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ సేవ చేయాలనే దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరూ తన జీవిత సంపాదనలో ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగించాలని కులమతాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమానికి మారుపేరు కోనా శ్రీనివాస్ అని తెలియజేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పేదల కోసం ఆర్యవైశ్యుల కోసం అనేక సేవా కార్యక్రమాలు అందిస్తుందని, పొట్టి శ్రీరాములు విగ్రహాయ ఏర్పాటుకు తగిన ఏర్పాటు చేస్తుందని, పెనుగొండ గ్రామాన్ని వాసవి పెనుగొండ గా మార్చిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని గ్రామీణ కాలంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి దోహదపడే అంశాలతో ముందుకు సాగుతామని తెలియజేశారు.

## సీఎం చంద్రబాబు  పై అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

**యర్ర గొల్ల రెడ్డెయ్య యాదవ్, పోలి రెడ్డి సుబ్బారెడ్డి**

**లక్కిరెడ్డిపల్లి జన సముద్రం న్యూస్ ఫిబ్రవరి 1**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పై వైసీపీ నేత అంబాటి రాంబాబు చేసిన అనుచిత, అ సభ్య వ్యాఖ్యలను అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రగొల్ల రెడ్డయ్య యాదవ్,మాజీ డిసిసి బ్యాంక్ డైరెక్టర్ పోలి రెడ్డి సుబ్బారెడ్డి ఖండించారు తీవ్రంగా ఖండించారు ఒకప్పుడు మంత్రి గా నిర్వహించిన వ్యక్తి స్థాయినీ పూర్తిగా మరిచి సభ్య సమాజం తలగించుకునేలా రాష్ట్ర ముఖ్య మంత్రి నీ



బూతులు తిట్టడం అత్యంత దిగజారుడు రాజకీయానికి నిదర్శనం అన్నారు ప్రజాస్వామ్యంలో విమర్శకులకు స్థానం ఉన్న, అది సంస్కార బద్ధంగా, గౌరవంగా ఉండాలని వ్యక్తిగత దూషణలకు, అసభ్య పదజాలం ప్రజా జీవితంలో ఉన్న నాయకులకు ఏమాత్రం శోభించవని ఇటువంటి వ్యాఖ్యల తో అంబాటి రాంబాబు తన రాజకీయ అవగాహన స్థాయిని, సంస్కార రాహిత్యాన్ని ప్రజల ముందు మరోసారి బయటపెట్టుకున్నారు రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పై ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం కేవలం రాజకీయ దౌర్భాగ్యమే కాకుండా , ప్రజల మనోభావాలను దెబ్బ తీసే చర్య, ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఇటువంటి నీచ వ్యాఖ్యలను ఖండించాలని అంబటి రాంబాబు వెంటనే తన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని భవిష్యత్తులో అయినా రాజకీయ హద్దులు, నమస్కారాలు పాటించాలని డిమాండ్ చేస్తున్నమన్నారు

## ప్రభుత్వ కళాశాలపై రాజకీయ పెత్తనం ఆపాలి: మార్గాని భరత్

**తూర్పుగోదావరి జిల్లా,రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్:**

కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎస్.ఎఫ్.ఐ (రాఖీ×) ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ మద్దతు ప్రకటించారు. కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన అధికారులను నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో హితకారిణి సమాజం పరిధిలోని విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం



చేశామని, ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కళాశాలపై హితకారిణి సమాజం చైర్మన్ లేదా రాజకీయ నాయకుల పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. కాలేజీ వార్డెన్‌ను తొలగించే అధికారం వీరికి ఎవరిచ్చారని, విద్యాశాఖ అధికారులు మరియు జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. విద్యాసంస్థకు చెందిన కోట్ల విలువైన భూములపై భూకబ్జాదారుల కన్ను పడిందని, స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే గూండాల ప్రవేశం జరుగుతోందని మార్గాని భరత్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు, విశ్రాంత అధ్యాపకులు మరియు వందలాది మంది విద్యార్థులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన 4వ వార్డు కౌన్సిలర్ కొలిమి హారూన్ భాషా

**ఇటీవల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి సమక్షంలో టీడీపీలో చేరిక.**

**రాయచోటి జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 1**

ఆదివారం రోజు మధ్యాహ్నం పట్టణంలోనే మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాయచోటి 4వ వార్డు వైసీపీ కౌన్సిలర్, వైసీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి కొలిమి హారూన్ భాషా,కొలిమి ఇనాయత్ భాషా, ఖాతీబ్ సోహరాబ్ (సర ఇండస్ట్రీస్), మొగల్ ఫైజాన్,



మహమ్మద్ ఆడమ్, అలీ నవాజ్, గణి, నోరుల్లహ్ పలువురు ముఖ్య వైసీపీ నేతలు రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశ్వాసం, నమ్మకాన్ని పెంచాయని తెలిపారు..పార్టీలో చేరే నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి టీడీపీ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు బోనమల ఖాదరవల్లి పాల్గొన్నారు ..

## అనపర్తిలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహనం



**తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్ :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అనపర్తిలో ఉద్రిక్తత నెలకొంది. యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. అనపర్తి దేవీచౌక్ వద్ద అంబటి రాంబాబు దిష్టిబొమ్మను కూటమి శ్రేణులు దహనం చేశాయి. అనంతరం దేవీచౌక్ నుండి పోలీస్ స్టేషన్ వరకు కూటమి నాయకులు భారీ పాదయాత్ర నిర్వహించారు. సీఎంపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మనోజ్ రెడ్డి మరియు ఇతర నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సామూహిక వ్రత పూజల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

**తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్ :**

రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కడియం మండలం వేమగిరి కొండపై వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మాఘ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ రమా వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి వ్రతంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ పాల్గొన్నారు. స్వామి వారిని



దర్శించుకున్న అనంతరం, ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రత క్రతువులో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## అన్నమయ్య జిల్లాలో 96 గొర్రెలను బల్లి తీసుకున్న ఊర కుక్కలు

**కుదేలైన రైతు కుటుంబం రెండు లక్షల పైగా ఆస్తి నష్టం**

**జనసముద్రం న్యూస్, మదనపల్లి, 01 ఫిబ్రవరి :-**

అన్నమయ్య జిల్లాలో పెను విషాదం చోటు చేసుకుంది. కుక్కల దాడిలో 96 గొర్రెలు మృత్యువాత పడ్డ విషాదకర సంఘటన ఆదివారం పిటిఎం మండలంలో వెలుగు చూసింది. తంబళ్లపల్లి నియోజకవర్గం లోని పెద్ద తిప్ప సముద్రం మండలం, పిడుంవారిపల్లికి చెందిన తంబళ్లపల్లి ఆకులమ్మ, నాగరాజ దంపతులు గొర్రెలను మేపుకొని కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నారు. ఈ క్రమంలో అర్థ రాత్రి వేళ ఊర కుక్కలు తన గొర్రెల మందపై దాడి చేసి 110 గొర్రెలు ఉండగా అందులో 96 గొర్రెలను



గొంతులు కొరికి చంపేయడంతో పెను విషాదం అలుముకుంది. 96 గొర్రెలు ఒక్కసారిగా మృత్యువాత పడడంతో గొర్రెలనే నమ్ముకుని జీవిస్తున్న ఆ రైతు కుటుంబం కుదేలైంది. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు సుమారు 2లక్షల నష్టం చోటు చేసుకుందని గ్రామస్తులు బాధితుడు ఆరోపిస్తున్నారు.

## శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణకు సుగవాసి ప్రసాద్ బాబుకు ఆహ్వానం

**రాయచోటి, జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 01:**

శ్రీ సత్యసాయి జిల్లా నంబుల పూలకుంట మండలం గూటిబైలు గ్రామం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిమ్మమ్మ మర్రిమాను ప్రాంగణంలో ఈనెల 7వ తేదీ (శనివారం) నిర్వహించనున్న శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మరియు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు కి ఆహ్వానం.

ఆదివారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శ్రీశ్రీ తిమ్మమాంబ బంధుగణ సేవా సమితి నిర్వాహకులు ప్రసాద్ బాబు ని



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 7న జరిగే విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేసి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ బండన్న స్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు సుగవాసి ప్రసాద్ బాబు కి ఆహ్వానం

**రాయచోటి, జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 01:**

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం, బి.కొత్తకోట మండలం బిరంగి సమీపంలోని వెలిసిన శ్రీ బండన్న స్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మరియు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారిని ఆలయ పిఠాధిపతి శ్రీ పగడాల లక్ష్మీపతి స్వామి ఆహ్వానించారు.

ఆదివారం రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ప్రసాద్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన



స్వామిజీ, ఫిబ్రవరి 15న జరిగే శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను, ఉత్సవాల నిర్వహణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తక్షణమే చర్యలు తీసుకోవాలి : వీరన్న చౌదరి

**తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్ :**

తొర్రేడు గ్రామ పరిసరాల్లో పులి సంచారంతో భయాందోళన చెందుతున్న ప్రజలకు రక్షణ కల్పించాలని రాజానగరం అసెంబ్లీ ఇన్చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి కోరారు. ఈ మేరకు ఆయన అటవీ శాఖ అధికారులను కలిసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పులిని త్వరగా బంధించి అటవీ ప్రాంతానికి తరలించాలని అధికారులకు



సూచించారు. ఈ విషయంపై ఇప్పటికే ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఉన్నతాధికారులతో చర్చించారని ఆయన తెలిపారు. అటవీ శాఖ వెంటనే స్పందించి ప్రజలకు, పశువులకు రక్షణ కల్పించి ధైర్యం నింపాలని కోరారు.

# మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకి

### ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు

**జనసముద్రం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 1**

మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకిప్రజలు తగిన గుణపాఠం చెప్తారనిబిఆర్ఎస్ పార్టీ పంచే డబ్బులు తీసుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటెయ్యాలని ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి కోరారు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం ఏర్పాటుచేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల అహంకారం ఇంకా పోవడం లేదని దీనిని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య మాట్లాడుతూ ఫోన్ టాపింగ్ వ్యవహారంలో సిట్ అధికారులు విచారణకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఆయన ఉండబడే నంది నగర్ లోని నివాసంలోనే విచారణకు పిలవడంతో



అది జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దిష్టిబొమ్మలను గ్రామ గ్రామాన దగ్ధం చేయడం ఉనికిని కాపాడుకోవడం కోసమేనని ఆయన దుయ్యబట్టారుఈ విచారణలో సిట్ అధికారులుప్రభాకర్ రావు ను మాజీ మంత్రి కేటీఆర్ ను హరీష్ రావును సంతోష్ రావులను ఇప్పటికే విచారించడం జరిగిందన్నారు. 600 మందికి సంబందించిన ఫోన్ టాపిక్ చేయడం జరిగింది ఇది చట్ట విరుద్ధమని ఇది తప్పు అని అధికారులు విచారణ చేయబోతే బిఆర్ఎస్ శ్రేణులు కెసిఆర్ మన తెలంగాణ గాంధీ అని అంటూ ఆయనను విచారణ కే పిలువద్దంటూ పిలిస్తే రాష్ట్రమంతా అగ్ని గుండమవుతుందని బెదిరింపులకు పాల్పడ్డారని బిఆర్ఎస్ పార్టీ వాళ్ళతో ఏమి ఒరిగేది లేదని ఎద్దుల చేశారుఅందరి లెక్క ఆయనను కూడా మూడు గంటలకు సిట్



అధికారులు విచారణ చేసి తీరుతారన్నారు,మున్సిపల్ ఎన్నికలలో తమ బండారం బయటపడుతుందనే ఉద్దేశంతోనే బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గ్రామ గ్రామానా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినారన్నారు ఈ విచారణ లో కేసీఆర్ కేటీఆర్ లు కేసులో ఇరుక్కోవడం ఖాయమన్నారు మండలంలోని బొప్పాపురం గ్రామంలో గొర్రె తలకాయ రాజన్నపేటలో కోడి తలకాయ పెట్టి తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దిష్టిబొమ్మను దహనం చేయడం ఇది బిఆర్ఎస్ పార్టీ నాయకుల అహంకారానికి నిదర్శనం అన్నారు, నిరసన తెలుపాలి కాని కించపరచడం పద్ధతి కాదన్నారు, ఫోన్ టాపింగ్ కేసులో కేసీఆర్ కేటీఆర్ ఎలా ఇరుక్కుపోతున్నారో అదే విధంగా ఇక్కడ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేసుల్లో నమోదు అయ్యి ఇరుక్కుపోతారని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో

# కనకదుర్గమ్మ అవతారంలో శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 1**

లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి ఆదివారం కనకదుర్గమ్మ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది గంగమ్మను చూడడానికి భక్తులు క్యూలైన్లో వేచి చూడాల్సి వచ్చింది ఆదివారం కావడంతో గంగమ్మ తల్లి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు అమ్మకు నైవేద్యం సమర్పించి అక్కడే జంతుబలులు ఇచ్చి బంధువులను స్నేహితులను పిలిచి అంగరంగ వైభవంగా ఒక చిన్న జాతర లాగా జరుపుకున్నారు గంగమ్మ తల్లి కనకదుర్గ అవతారం భక్తులకు కనువిందు చేసింది గంగమ్మ తల్లిని కనకదుర్గ అవతారంలో అలంకరించినటువంటి పూజారి ఆదిమూలం రెడ్డి శేఖర్ బృందానికి భక్తులు అభినందనలు తెలియజేశారు



# జక్కంపూడి కుటుంబం హౌస్ అరెస్ట్

**తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్ :**

మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సంఘీభావం తెలిపేందుకు గుంటూరు వెళ్లేందుకు సిద్ధమైన జక్కంపూడి కుటుంబాన్ని పోలీసులు అడ్డుకున్నారు. జక్కంపూడి నివాసం వద్ద భారీగా మోహరించిన పోలీసులు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువజన నాయకుడు జక్కంపూడి గణేష్‌లను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో జక్కంపూడి రాజా తీవ్ర వాగ్వివాదానికి దిగారు. తమను ఎందుకు వెళ్లనీయడం లేదని నిలదీస్తూ ఆగ్రహం వ్యక్తం



చేశారు. "రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు" అంటూ పోలీసులను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. నివాసం వద్ద పోలీసుల మోహరింపుతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేధింపులకు నిరసనగా కోరుట్ల పట్టణంలో ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

**జనసముద్రం/కోరుట్ల నియోజకవర్గ ప్రతినిధి**

ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ

కేసీఆర్ ని సిట్ విచారణకు పిలవడం అనేది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్య అని తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన కేసీఆర్ ప్రజాదరణను తట్టుకోలేకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ, ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందన్నారు.ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం,



ఎన్నికల్లో ఎదురైన పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, నోటీసులతో భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు.ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేస్తాయని హెచ్చరించారు.కేసీఆర్ పై జరుగుతున్న రాజకీయ వేధింపులను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని, తగిన సమయంలో కాంగ్రెస్?కు గట్టి బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.ఈ నిరసన ర్యాలీలో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి వాసంశెట్టి సుభాష్

**తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రపురం, ఫిబ్రవరి 1, జనసముద్రం న్యూస్:**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. కాజులూరు మండలం పెదలంక, కోలంక గ్రామాల్లో రూ.30.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నాణ్యమైన రోడ్లు గ్రామాల పురోగతికి వెన్నెముక లాంటివని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్ని గ్రామాలకు సమ ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు



చేపడుతున్నట్లు తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల అవసరాల మేరకు మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై భగ్గుమన్న ఒంటిమిట్ట టిడిపి శ్రేణులు

### అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దగ్ధం

**ఒంటిమిట్ట జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 1**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై ఒంటిమిట్ట టిడిపి శ్రేణులు బగ్గుమన్నాయి. ఆదివారంఒంటిమిట్ట బస్టాండ్ లో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను ఒంటిమిట్ట టిడిపి శ్రేణులు దగ్ధం చేశారు ఈ సందర్భంగా ఒంటిమిట్ట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పిటిసి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి, ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి



కార్యక్రమాలను ఓర్వలేక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై వ్యక్తిగతఅనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఆలూరి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వ్యక్తిపై ఆంబోతు అంబటి రాంబాబు వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వైసిపి



నాయకులు ఎదుర్కొనే సత్తా లేక వైసీపీలో పలువురు గుండాలు తెలుగుదేశం ప్రభుత్వంపై బురద చల్లుతున్నారన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల భాష ఎలక్ట్రికల్ క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఎస్ వి రమణ లాయర్ రామదాసు సర్పంచ్ ప్రతినిధి బొడ్డే వెంకటరమణ గఫార్ రెహమాన్ ఐ టి డి పి మండలాధ్యక్షుడు ఎల్లయ్య నామాల వెంకటయ్య మౌలాలి రోశయ్య పొట్టేటి రాజారెడ్డి చింత గింజల సుబ్రహ్మణ్యం టిడిపి ఎస్సీ సెల్ నాయకులు నర్సింహులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

# డేరంగుల సుబ్బరాయుడు పార్థివ దేహానికి నివాళులర్పించిన యనమల మదన్ మోహన్





**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఫిబ్రవరి 1**

రాయచోటి నియోజకవర్గం

లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడు గ్రామం వడ్డేపల్లెకు చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త డేరంగుల సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి నివాళులర్పించిన, అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసిన టిడిపి మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ నివాళులర్పించిన వారిలో చెరువు చైర్మన్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రంగసుబ్బయ్య,ధర్మరాజు, ఓబులేసు, పీరయ్య, సుబ్బరాజు, సురేంద్ర రాజు,రహీం,టిడిపి నాయకులు,కార్యకర్తలు, తదితరులు ఉన్నారు

## భారత పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్లో పేద సామాన్య ప్రజలను విస్మరించారు

### ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు

**ఎల్కతుర్తి పిబ్రవరి 01 (జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు మాట్లాడుతూ..భారత పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్లో మెజార్టీ ప్రజలైన పేదలు కార్మికులు బలహీన వర్గాల ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎలాంటి భరోసా ఇవ్వలేదని బొంకూరి రాజు అన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడే ప్రభుత్వ విద్యా రంగానికి



మొత్తం బడ్జెట్లో 2.5 శాతం మాత్రమే కేటాయించి పేద వర్గాలకు మెరుగైన విద్యను అందకుండా చేస్తున్నారు వైద్య రంగానికి మొత్తం బడ్జెట్లో 2 శాతం మాత్రమే కేటాయించి సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేకుండా చేస్తున్నారు విద్య వైద్య రంగాలలో ప్రైవేట్ కార్పొరేటర్ రంగాలను ప్రోత్సహించే విధంగా ఈ కేంద్ర బడ్జెట్ ఉందన్నారు గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం ఎలాంటి కేటాయింపులు లేవు ప్రైవేట్ కార్పొరేట్ పరిశ్రమలకు మాత్రం అనేక మినహాయింపులు ఇచ్చారు గ్రామీణ వ్యవసాయ రంగ అభివృద్ధికి నామమాత్రపు నిధులు మాత్రమే కేటాయించారు పేదలు కార్మికుల ఆర్థిక స్వాలంబన కోసం ఈ బడ్జెట్లో ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు సామాజిక న్యాయానికి పేదరిక నిర్మూలనకు ఉపయోగపడని సామాన్యులకు ఊరట నివ్వని కేంద్ర బడ్జెట్ అని బొంకూరి రాజు విమర్శించారు

# శ్రీ వారి శాశ్వత అన్నదాన ట్రస్ట్ కి విరాళం.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఫిబ్రవరి 1 ద్వారకాతిరుమల.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత అన్నదాన ట్రస్ట్ కి ఆదివారం ఖమ్మం వాస్తవ్యులు వేముల లక్ష్మణరావు రూ.1,00,116 /- ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకి దేవస్థానం ఏఈఓ



నటరాజురావు విరాళం బ్రాండును అందజేసి అభినందించారు.దాత కుటుంబానికి స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు.



# నన్ను నడిపించేది సినిమా పాఠాలే

తనలో ఉన్న కళలన్నింటినీ బయట పెట్టాల్సిన అవసరం లేదని అంటోంది కథానాయిక శ్రుతి హాసన్. తనదైన నటనతో ఆకట్టుకుంటూనే.. గాయనిగా కూడా సినీప్రియుల్ని అలరిస్తుందీమె. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి మాట్లాడుతూ.. "నాకు విభిన్న మార్గాల్లో నడవడం ఇష్టం. ఒకే గుర్తింపులో నన్ను నేను బంధించాలనుకోవట్లేదు. నాకు సంగీతం, నటన, రచన అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ అన్నింటి కన్నా ముందు నటిగా ఉండటానికే ఇష్టపడతా. నాకు అదే ఆనందాన్నిస్తుంది. శారీరక శ్రమతో కూడిన పాత్రలు చేయాలనే కోరిక ఉంది. సినిమా నా వృత్తి జీవితంలో ఒక భాగం. కానీ సంగీతం నా వ్యక్తిగత విషయం. సినిమా నాకు ప్రజలతో ఎలా ఉండాలో నేర్పించింది. ఆ పాఠాలే ఒక సంగీతకారిణిగా, మనిషిగా నన్ను ముందుకు నడిపిస్తున్నాయ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె.. విజయ్ సేతుపతితో కలిసి నటించిన 'ట్రైన్' విడుదలకు సిద్ధంగా ఉంది. దీంతో పాటు 'ఆకాశంలో ఒక తార', 'సలార్ 2' లాంటి చిత్రాలు శ్రుతి ఖాతాలో ఉన్నాయి.

# నటన కంటే దర్శకత్వమే ఇష్టం



"దర్శకుడిగా ఓ జానర్‌కే పరిమితం కావాలని అనుకోవట్లేదు. విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పించాలనుకుంటున్నా" అన్నారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఇప్పుడాయన హీరోగా 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం విలేకర్లతో ముచ్చటించారు తరుణ్ భాస్కర్.

"రీమేక్‌లు పూర్తిగా తగ్గిపోతున్న తరుణంలో ఈ సినిమాని ప్రేక్షకులు ఇంత గొప్పగా ఆదరిస్తుండటం ఆనందాన్నిస్తోంది. దీన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఒరిజినల్ సినిమాలాగే అనుభూతి చెందుతున్నారు. ఈ కథని తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా మార్చేందుకు మా చిత్ర బృందం చాలా కష్టపడింది. మలయాళ మాతృక నుంచి కేవలం మూల కథను మాత్రమే తీసుకుని గోదావరి జిల్లాల నేపథ్యానికి తగ్గట్లు పూర్తిగా కొత్త బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసుకున్నాం. అది మంచి ఫలితాన్నిచ్చింది. ప్రస్తుతం ప్రేక్షకుల్ని అలరించడానికి ఒక మంచి కథ కావాలి. అలాంటి కథ ఇస్తే వాళ్లు కచ్చితంగా ఆదరిస్తారని ఈ సినిమాతో మరోసారి నిరూపితమైంది".

"ఈ సినిమాలో నేను పోషించిన ఓంకార్ నాయుడు పాత్ర కోసం చాలా హోంవర్క్ చేశాను. యాస, బాడీ లాంగ్వేజ్, వ్యవహార శైలిలో ఇది నా నిజ జీవితానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. అందుకే ఈ పాత్రను పట్టుకోవడానికి చాలా వర్క్ చేశాను. నేనిప్పటి వరకు చేసిన పాత్రల్లో నాకు అత్యంత సంతృప్తినిచ్చిన, సవాల్ విసిరిన పాత్రిదే. ఈ సినిమా చేశాక నటన పట్ల మరింత గౌరవం పెరిగింది. ఈ చిత్రంలో ఈషా రెబ్బా అద్భుతమైన నటనను కనబరిచింది. తనకు మార్షల్ ఆర్ట్స్ కూడా తెలియడంతో అది మా చిత్రానికి బాగా కలిసొచ్చింది".

"నా సినీ ప్రయాణం పట్ల నేను పూర్తి సంతృప్తిగా ఉన్నా. నటన కన్నా దర్శకత్వాన్నే ఎక్కువ ఇష్టపడతా. ఎందుకంటే మనం సృష్టించిన కథను తెరపై చూడటంలో ఉన్న ఆనందం ఇంకెందులోనూ రాదు. నేను నటించిన మరో రెండు సినిమాలు ఈ ఏడాదే విడుదల కానున్నాయి. ఆ తర్వాత పూర్తిగా దర్శకత్వంపైనే దృష్టి సారిస్తాను. నాకు దర్శకుడిగా ఇప్పటికే కామెడీపై పట్టు వచ్చిందని అనుకుంటున్నా. ఇకపై గ్యాంగ్‌స్టర్, క్రైమ్ డ్రామా, యాక్షన్ థ్రిల్లర్, రొమాంటిక్ కామెడీ.. ఇలా భిన్నమైన జానర్లు చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం నా దర్శకత్వంలో 'ఈ నగరానికి ఏమైంది 2' సిద్ధమవుతోంది. ఇది తొలి భాగంతో పోల్చితే స్కేల్ పరంగా చాలా పెద్దగా ఉంటుంది. ఇందులో పాత్రలన్నీ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఇక వెంకటేశ్‌తో చేయాల్సిన సినిమాకి ఇంకా చాలా టైమ్ పడుతుంది. ఆ కథపై ఇంకా వర్క్ చేయాల్సి ఉంది".

# రామ్‌చరణ్ ప్రపంచం వీళ్లే..

## విషెస్ తెలిపిన సినీ ప్రముఖులు



రామ్‌చరణ్ ఉపాసన దంపతులు మరోసారి తల్లిదండ్రులయ్యారు. కవలలు (పాప, బాబు) పుట్టడంతో అటు వారి కుటుంబం, ఇటు అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది. పలువురు సినీ ప్రముఖులూ సంతోషం వ్యక్తం చేస్తూ.. ఈ దంపతులకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు . చిరంజీవి తనయ సుస్మిత, చిరు మేనల్లుడు సాయి దుర్గాతేజ్ తదితరులు ఆసక్తికర పోస్టులు పెట్టారు.

"కవల పిల్లలకు జన్మనిచ్చిన ఉపాసన- రామ్‌చరణ్‌లకు శుభాకాంక్షలు. ఈ కుటుంబంలో ఎప్పుడూ ప్రేమ, ఆనందం, ఆరోగ్యం నిండి ఉండాలని కోరుకుంటున్నా" – నటుడు ఎన్టీఆర్

"డియర్ చరణ్, ఉపాసన.. కొన్ని ఆనందకర క్షణాలు మాటలకు అందవు. మీరు ట్విన్స్‌కు జన్మనివ్వడం మా అందరికీ చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణం మా కుటుంబానికి ఎంతో ప్రత్యేకం" – నిర్మాత అల్లు అరవింద్


"మా కుటుంబానికి ఇదో కొత్త అనుభూతి. చరణ్, ఉపాసనలకు కవలలు జన్మించడంతో మా హృదయాలు ఆనందంతో నిండిపోయింది. సుస్మిత, చరణ్, శ్రీజ.. చిరంజీవి మామకు బలం. అలాగే చరణ్‌కు క్లీంకార, ఈ ట్విన్సే ప్రపంచం అవుతారు" – నటుడు సాయి దుర్గాతేజ్

"అన్నా, వదినలకు కంగ్రాట్స్. డబుల్ లవ్, డబుల్ హ్యాపీనెస్" – నటుడు వరుణ్‌తేజ్

"హాయ్ లిటిల్ ట్విన్స్.. ఈ ప్రపంచంలోకి మీకు స్వాగతం. ఇప్పటికే మీపై ఎంతోమంది ప్రేమ చూపించారు. క్లీంకార ఇప్పుడు బిగ్ సిస్టర్ అయింది. కంగ్రాట్స్ చరణ్, ఉపాసన" – నటి లావణ్యా త్రిపాఠి

"మా కుటుంబం విషయంలో 2026 గొప్పగా ప్రారంభమైంది. నేను మరోసారి అత్తయ్యను అయ్యా. ఈసారి రెట్టింపు ఆనందం, ప్రేమతో ఉండటం చాలా ప్రత్యేకం. కంగ్రాట్స్ చరణ్, ఉప్సీ" – నిర్మాత సుస్మిత కొణిదెల

నటుడు ఆదిసాయి కుమార్, దర్శకులు అనిల్ రావిపూడి, బుచ్చిబాబు, బాబీ, వశిష్ఠ, గోపీచంద్ మలినేని, సంపత్ నంది, నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సంగీత దర్శకుడు తమన్ తదితరులు చరణ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



# సరికొత్త కాక్‌టెయిల్

గతేడాది 'కుబేర', 'ఛావా' లాంటి వరుస సినిమాలతో మంచి విజయాల్ని అందుకున్న కథానాయిక రష్మిక.. ఈ సంవత్సరం కూడా అంతకు మించిన కథలతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'కాక్‌టెయిల్ 2' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్, రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటోను పంచుకున్నారు దర్శకుడు. "విజయవంతంగా 'కాక్‌టెయిల్ 2' షూటింగ్ ముగిసింది. నా అద్భుతమైన నటీనటులకు, బృందానికి ధన్యవాదాలు. చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ఇది" అనే వ్యాఖ్యల్ని జోడించారు. 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా ఓ సరికొత్త ప్రేమ కథగా దీన్ని తీర్చిదిద్దుతున్నారని, ఈ ఏడాది ద్వితీయార్థంలో థియేటర్లలోకి రానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# బాలీవుడ్ దర్శకుడి ఇంటి వద్ద కాల్పుల కలకలం!



ముంబయిలో బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి నివాసం వద్ద కాల్పుల జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున నగరంలోని జుహు ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మొత్తం నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నామని, దీనిపై దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు. కాల్పుల సమయంలో రోహిత్ ఇంట్లో ఉన్నారా? లేదా? అనే దానిపై స్పష్టత లేదు. కాల్పుల నేపథ్యంలో అధికారులు అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు.

# చిరు నా గురించి మాట్లాడారనగానే కళ్లలో నీళ్లు తిరిగాయి: నవీన్ పొలిశెట్టి



"ఈ సంక్రాంతి అటు ఏడుతరాలు.. ఇటు ఏడుతరాలు గుర్తుండిపోతుంద"న్నారు కథానాయకుడు నవీన్ పొలిశెట్టి. ఈ పండక్కి పెద్ద చిత్రాలు పోటీలో ఉన్నా.. తమ 'అనగనగా ఒక రాజు' విడుదలై విజయాన్ని సొంతం చేసుకుందంటే అది తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదమేనని తెలిపారు. నవీన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని మారి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలైన నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు బాబీ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ సినిమా.. నవీన్ వన్‌మ్యాన్ షో. తను కచ్చితంగా నవ్విస్తాడన్న నమ్మకాన్ని ప్రేక్షకుల నుంచి పొందాడు. కష్టపడితే విజయం వస్తుందని చెప్పేందుకు 'అనగనగా ఒక రాజు' ఓ ఉదాహరణ" అన్నారు. "ఈ సినిమా విడుదలయ్యాక.. నా చిత్ర చర్చల్లో భాగంగా ఓసారి చిరంజీవిని కలిశా. 'అనగనగా ఒక రాజు' సినిమా బాగుందట కదా' అని అడుగుతూ.. 'ఈతరం వారిలో నాకు బాగా నచ్చిన హీరో నవీన్' అని చిరు చెప్పారు" అన్నారు దర్శకుడు బాబీ. హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "నేను హీరో అవ్వడానికి స్ఫూర్తి చిరంజీవి. అలాంటిది ఆయన సినిమాతో పాటు విడుదలై, ఆయనతో పాటుగా విజయం సాధించడం సంతోషంగా ఉంది. చిరు నా గురించి మాట్లాడారని బాబీ చెప్పినప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ పరిశ్రమలో హీరో కావడం చాలా కష్టం. ఆ ప్రయాణం చేస్తే గానీ దాని గురించి అర్థం కాదు. 'యూట్యూబర్ నుంచి హీరో అయిన వాళ్లు ఎవరున్నార'ని నన్ను నిరుత్సాహపరిచారు. ఓ దశలో ఇండస్ట్రీని వదిలేసి వెళ్లిపోదామనుకున్నా. కట్ చేస్తే.. తెలుగు ప్రేక్షకులు నాకు వరుసగా నాలుగు విజయాలు అందించారు" అన్నారు. ఈ కార్యక్రమంలో నాగవంశీ, మీనాక్షి చౌదరి, మారి, చిన్మయి, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.